క్లుప్తంగా

తునికాకు సేకరణ ప్రారంభం



తునికాకు పేరుస్తున్న కూలీలు

దహెగాం: మండలంలోని గిరవెల్లి యూనిట్ పరిధిలో సోమవారం నుంచి తునికాకు సేకరణ ప్రారంభమైందని ఎఫ్ఆర్వో అప్పలకొండ తెలిపారు. గిరవెల్లి యూనిట్ పరిధిలో 12 కల్లాలు ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. 5,200 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యం పెట్టుకున్నామని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రజలు అడవిలోకి వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

కౌటాల: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరూప సోమవారం తెలిపారు. పదో తరగతి మెమో, పాఠశాల టీసీ, ఆధార్‌కార్డ్ జిరాక్స్ పత్రాలను సమర్పించి జనరల్, ఒకేషనల్ విభాగాల్లో ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఇతర సమాచారం కోసం మండల కేంద్రంలోని కళాశాలకు వచ్చి నేరుగా సంప్రదించాలని కోరారు.

అనారోగ్యంతో బీఎస్పీ మండలాధ్యక్షుడు మృతి



భీంరావు (ఫైల్)

కెరమెరి: మండలంలోని శివగూడ గ్రామానికి చెందిన బహుజన్ సమాజ్ వాదీ పార్టీ మండలాధ్యక్షుడు కుర్సెంగ భీంరావు (30) ఆదివారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఆయనకు తీవ్ర జ్వరం రావడంతో సుర్దాపూర్‌లోని ప్రైవేటు వైద్యుడి వద్దకు తీసుకెళ్లి వైద్యం చేయించారు. అయినా తగ్గకపోవడంతో ఆదివారం ఝరిలో ఉన్న పెద్ద దేవుని వద్దకు తీసుకెళ్లారు. అక్కడే వాంతి చేసుకుని భీంరావు మృతి చెందాడు. బీఎస్పీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కనక ప్రభాకర్ ఆయన కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు.

గోల్డ్‌మెడల్ సాధించిన తనిష్క్‌కు సన్మానం



పూలదండలతో సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: భూటాన్‌లో జరిగిన జాతీయ సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో బంగారు పతకం సాధించి జిల్లా కేంద్రానికి చేరుకున్న తనిష్క్‌కు సోమవారం జిల్లా కేంద్రంలో బీసీ, మేరు సంఘాల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మండలంలోని తుంపెల్లికి చెందిన రేఖల తిరుపతి, సునీత దంపతుల కుమారుడు తనిష్క్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. కార్యక్రమంలో సాఫ్ట్ బేస్‌బాల్ రాష్ట్ర కార్యదర్శి గురువేందర్, శిక్షకుడు తిరుపతి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్‌నర్ రమేశ్, మేరు సంఘం నాయకులు రాపర్తి కార్తీక్, మాడిశెట్టి ప్రశాంత్, రామగిరి అశోక్, రాపర్తి వెంకటేశ్, శ్రావణ్, మేరు సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమ్మేళనం విజయవంతం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న సిడాం ధర్ము

కెరమెరి: ఆదివాసీ కొలాం సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 17, 18, 19 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని సాలెగూడలో నిర్వహించే కొలాం జన జాగృతి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కెరమెరి, వాంకిడి మండలాల పీటీజీ సూపర్‌వైజర్, కొలాం సంఘం జిల్లా నాయకుడు సిడాం ధర్ము అన్నారు. మండల కేంద్రంలో సోమవారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సమ్మేళనంలో కొలాం తెగ స్థితిగతులు, భవిష్యత్తు, ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరీ, సంక్షేమ పథకాలు, తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

బియ్యం పంపిణీ

పెంచికల్‌పేట్: మండలంలోని మెరెగూడ గ్రామానికి చెందిన 5నిరుపేద కుటుంబాలకు ఎస్సై విజయ్‌కుమార్ సోమవారం 75కిలోల బియ్యం పంపిణీ చేశారు. అయన మాట్లాడుతూ యువత చదువుపై దృష్టి సారించాలని, గ్రామాల్లో అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించవద్దన్నారు.

సమస్యల్లో 'పంగిడిమాదర'

- మౌలిక సదుపాయాలు లేక అవస్థలు
- ఇటీవల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన ఆదివాసీలు
- ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరిక



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న పంగిడిమాదర గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలు (ఫైల్)



అధ్వానంగా పంగిడిమాదర నుంచి లింగాపూర్‌కు వెళ్లే రోడ్డు

తిర్యాణి: మండలంలో అత్యంత వెనుకబడిన ఉమ్మడి పంగిడిమాదర గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీలు ఆందోళన బాటపట్టారు. వారం రోజుల క్రితం సమస్యల పరిష్కారానికి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌తో పాటు జిల్లా అటవీ అధికారికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

సౌకర్యాలు కరువు

పంగిడిమాదర గ్రామం నుంచి ఇతర అనుబంధ గ్రామాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. ఆయా గ్రామాల్లో ఫోన్ సిగ్నల్స్ కూడా రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంగిడిమాదర, భీంజిగూడ గ్రామాల్లో ప్రైవేట్ కంపెనీకి చెందిన నెట్‌వర్క్ టవర్లు ఏర్పాటు చేసినా అనివార్య కారణాలతో వాటిని ప్రారంభించడం లేదు. 15ఏళ్ల క్రితం మంజూరైనా సబ్ సెంటర్ ఇంకా నిర్మాణ దశలోనే ఉందంటే ఇక్కడి పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. వానాకాలంలో భీంజిగూడ వద్ద వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాలకు బయటి ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతున్నాయి.

గ్రామస్తుల ప్రధాన డిమాండ్లు..

- భీంజిగూడ గ్రామంలో నిర్మాణం పూర్తయిన సెల్‌టవర్‌ను వెంటనే ప్రారంభించాలి.
- పంగిడిమాదర పోచ్చమ్మ దేవాలయం నుంచి దానపూర్ గ్రామం వరకు వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి. పంగిడిమాదర నుంచి మెడిగూడ మీదుగా లింగాపూర్ వరకు అటవీ అనుమతులతో రోడ్డును వెంటనే నిర్మించాలి.
- ప్రతీ గ్రామానికి రోడ్డు, సైడ్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలి.
- నిర్మాణం దశలో ఉన్న సబ్‌సెంటర్‌ను వెంటనే పూర్తి చేసి ప్రారంభించాలి.
- బుగ్గగూడ గ్రామంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి.
- చల్లాలగూడ వాగుపై బ్రిడ్జి నిర్మించాలి.
- మర్కగూడ నుంచి గోవేన వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలి.
- ఎలాంటి షరతులు విధించకుండా పోడు భూములను సాగు చేస్తున్న వారికి హక్కు పత్రాలు ఇవ్వాలి.

సమస్యలు పరిష్కరించాలి



ఉమ్మడి పంగిడిమాదర గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి. సమస్యలపై ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. అన్ని గ్రామాలకు సైడ్‌డ్రెయిన్స్‌తో పాటు రోడ్డు నిర్మాణాలు చేపట్టాలి.

- తురం గోపాల్, చింతలమాదర

ఆందోళనలు ఉధృతం చేస్తాం



ఉమ్మడి పంగిడిమాదర పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తాం. సరైన రోడ్లు లేకపోవడంతో అత్యవసర సమయంలో రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- గేడం సుభాష్, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు

చిట్టడవిని తలపిస్తున్న దారి

- ఇబ్బందులు పడుతున్న జంబుగ ప్రజలు
- పాములు, విష పురుగులు సంచరిస్తున్న వైనం
- గతంలో పాముకాటుకు గురై ఒకరు మృతి
- వీధి దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్



జంబుగ గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలో జంబుగ గ్రామానికి ఓ మంచి గుర్తింపు ఉంది. గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్, ఉద్యానవన కేంద్రంతో పాటు రైతువేదిక ఉన్నాయి. దీంతో గ్రామాన్ని ప్రతీనెల ఏదో ఒక సందర్భంలో ఉన్నతాధికారులు సందర్శిస్తుంటారు. కాగజ్‌నగర్ - పెంచికల్‌పేట్ రహదారి నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న జంబుగ గ్రామంలోకి వెళ్లేందుకు బీటీ రోడ్డు లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డుపై పాములు, తేళ్ల సంచారం..

జంబుగ గ్రామం మండల కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. కాగజ్‌నగర్ -పెంచికల్‌పేట్ ప్రధాన రహదారి నుంచి జంబుగా గ్రామానికి ఒక కిలోమీటర్ దూరం ఉంటుంది. గ్రామానికి చేరుకోవడానికి మట్టిరోడ్డు ఉండటంతో వర్షాకాలంలో బురదమయంగా మారుతుంది. వివిధ పనుల నిమిత్తం గ్రామస్తులు నిత్యం కాగజ్‌నగర్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. పనులు ముగించుకుని రాత్రి సమయంలో ఇంటికి చేరుకునే క్రమంలో జంబుగ స్టేజ్‌పై దిగి గ్రామంలోకి వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. కాగజ్‌నగర్ ప్రధాన రహదారి నుంచి గ్రామానికి వెళ్లే దారి చిట్టడవిని తలపిస్తుంది. పాములు, తేళ్ల సంచారం రోడ్డుపై ఎక్కువగా ఉంటుంది. రోడ్డుకు ఇరువైపులా వీధి స్తంభాలు ఉన్నప్పటికీ వీధి దీపాలు అమర్చకపోవడంతో పూర్తిగా అంధకారంగా ఉంటుంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి గ్రామం వరకు బీటీ రోడ్డుతో పాటు వీధిదీపాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జంకుతున్న జనం

రాత్రి సమయంలో స్టేజిపై దిగి గ్రామంలోకి వెళ్లేందుకు గ్రామస్తులు జంకుతున్నారు. రెండేళ్ల క్రితం గ్రామానికి చెందిన టేకం బాపయ్య అనే వ్యక్తి పాముకాటుకు గురై మృతి చెందారు. కాగజ్‌నగర్ నుంచి బస్సులో వచ్చి ప్రధాన రహదారి జంబుగ స్టేజిపై దిగిన ఆయన ఇంటికి చేరుకునేందుకు కాలిబాటతో పయనయ్యారు. వీధి దీపాలు లేక అంధకారంగా ఉండడంతో పాము కాటుకు గురై మృతిచెందారు. అయినా అధికారులు ఇప్పటివరకు రోడ్డుపై వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి



వీధి దీపాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయంలో స్టేజిపై దిగి ఇంటికి వెళ్లాలంటే తీవ్రంగా భయాందోళన చెందుతున్నాం. రోడ్డు వెంట విద్యుత్ దీపాలు అమర్చాలి. కనీసం రోడ్డు పక్కన ఉన్న చెట్లను నరికివేస్తే పాములు, విష కీటకాలు రాకుండా ఉంటాయి.

- రోహిత్ సింగ్, జంబుగ

అధికారులు స్పందించాలి



మా ఊరికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం సక్రమంగా లేదు. ప్రధాన రహదారి నుంచి ఇంటికి వచ్చే క్రమంలో గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పాము కాటుతో మృతి చెందాడు. అయినా అధికారులు వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. ఉన్నతాధికారులు స్పందించి బీటీ రోడ్డుతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.

- దేవి సింగ్, జంబుగ

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- సీఎం కప్ పోటీలు ప్రారంభం



పెంచికల్‌పేట్: క్రీడలు ప్రారంభిస్తున్న తహసీల్దార్ సరిత

చింతలమానెపల్లి: యువత చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో సీఎం కప్ పోటీలను ఎంపీపీ డుబ్బుల నానయ్య, తహసీల్దార్ మష్కూర్ అలీ, అధికారులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ పోటీలు, బాబాపూర్ ఆశ్రమ పాఠశాలలో కబడ్డి, ఖోఖో పోటీలను నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్, ఎస్సై విజయ్ కుమార్, ఎంపీవో సుధాకర్ రెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: సీఎం కప్ పోటీలను మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో సోమవారం అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రారంభించారు. మొదటిరోజు వాలీబాల్, కబడ్డీ క్రీడలు ఆడించారు. ఆమె మాట్లాడుతూ యువత ఆటల్లో తమ ప్రతిభ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఎంపీవో సుదర్శన్, తహసీల్దార్ జమీర్, ఎస్సై వెంకటేశ్, ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, సర్పంచ్ బైనాబాయి, ఎంపీటీసీ ఇష్తేకార్, ఉపసర్పంచ్ నిసార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఉత్తం నాయక్ ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో సీఎంకప్ మండలస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. మూడు రోజుల పాటు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఉప సర్పంచ్ తిరుపతి, కార్యదర్శి సాయికృష్ణ, భాస్కర్, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, నాయకులు మధుకర్, బాపు, బందు, రమేశ్ పాల్గొన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: క్రీడాకారులు తమ క్రీడాస్ఫూర్తి చాటాలని ఎంపీపీ ముండే విమలబాయి అన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఎంకప్ పోటీలను ఆమె సోమవారం మండల కేంద్రంలో ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల అభివృద్ధికి ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అజయ్‌కుమార్, తహసీల్దార్ రహీముద్దిన్, ఎంపీవో శివకుమార్, ఎస్సై సాగర్ తదితరులు ఉన్నారు.

తిర్యాణిలో..

తిర్యాణి: క్రీడాకారులు గెలుపోటములు సమానంగా తీసుకోవాలని ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీఎంకప్ పోటీలు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభ వెలికితీసేందుకు ప్రభుత్వం సీఎంకప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీటీసీ చంద్రశేఖర్, ఎస్సై రమేశ్, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ ఉన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో సీఎంకప్ మండలస్థాయి క్రీడలను తహసీల్దార్ పి. సరిత, ఎంపీడీవో గంగాసింగ్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభకు కొదువ లేదన్నారు. మండలానికి చెందిన క్రీడాకారులు జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచి మండలానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఎస్సై విజయ్‌కుమార్, సర్పంచ్‌లు శ్రీనివాస్, సంజీవ్, సుధాకర్, చంద్రమౌళి, రాజన్న, మధునయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు సాజీద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, నాయకులు చౌదరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ మండలంలో..

కాగజ్‌నగర్‌రూరల్: సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలు పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయ క్రీడా మైదానంలో సోమవారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎంపీడీవో గౌరీశంకర్, ఎంఈవో భిక్షపతిలు ప్రారంభించారు. పీఈటీలు నరేందర్ రావు, వెంకటేశ్, శారద, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



పరిచయం చేసుకుంటున్న చాహత్ బాజ్‌పాయ్



చింతలమానెపల్లిలో..



కౌటాల: క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

రెబ్బెన: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రెబ్బెన పోలీసుల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేశ్‌లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఉత్సవాలు పురస్కరించుకుని జిల్లాలోని యువతను క్రీడల వైపు నడిపించేందుకు గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో ఈనెల 20, 21, 22 తేదీల్లో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15,116, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 10,116 నగదు బహుమతిని అందజేస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 19వ తేదీ లోపు రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారను. పూర్తి వివరాలకు 7036532766, 9966775388, 8555903856, 8712670532 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వేసవి శిబిరాలతో సత్ఫలితాలు



మాట్లాడుతున్న డీటీడీవో మణెమ్మ

ఆసిఫాబాద్‌రూరల్: వేసవి శిబిరాల నిర్వహణతో సత్ఫలితాలు వస్తున్నాయని డీటీడీవో మణెమ్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ సమ్మిట్ వేసవి శిబిరాల ముగింపు కార్యక్రమానికి సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన కంప్యూటర్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కుట్లు అల్లికలు, డ్యాన్స్ తదితర కార్యక్రమాలు విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వేసవి శిబిరాలను విజయవంతంగా నిర్వహించిన సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో క్షేత్రయ్య, పురుషోత్తం, జీసీడీవో శకుంతల తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు చర్చకు వచ్చేనా..?

- గ్రామాల్లో రాజ్యమేలుతున్న సమస్యలు
- నేడు కౌటాల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



గుంతలమయంగా మొగడ్‌దగడ్ రోడ్డు

కౌటాల: ఆరు నెలల అనంతరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరుగనుంది. సమావేశంలో మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, యాసంగి పంటల కొనుగోలు, అకాల వర్షాలతో పంటల నష్టాలు, నీటి ఎద్దటి, కరెంట్ కోతలు, రానున్న ఖరీఫ్ కాలంలో పంటల సాగు, విత్తనాలు, ఎరువుల కొరత, అంగన్‌వాడీల నిర్వహణ వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది.

ఆరు నెలల అనంతరం

ప్రతీ మూడు నెలలకోసారి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉండగా గతేడాది నవంబర్ 19వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం గత ఫిబ్రవరి 17న కోరం లేక సమావేశం వాయిదా వేశారు. కాని తిరిగి సమావేశం నిర్వహించలేదు. తిరిగి ఆరు నెలల అనంతరం నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ప్రతీ సర్వసభ్య సమావేశంలో సుమారు 20 నుంచి 25 అంశాలు ఎజెండాలో పొందుపరుస్తున్నా.. 10లోపు ప్రధాన అంశాలు ప్రస్తావించి సమావేశాన్ని మమ అనిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

పలు సమస్యలు..

మండలంలోని తాటిపల్లి, కన్నెపల్లి, నాగేపల్లి, తాటినగర్, తదితర గ్రామాలకు తారురోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. దీంతో గ్రామీణ ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ముత్తంపేట, గుండాయిపేట, తలోడి గ్రామాల్లోని మినీ బస్టాండ్‌లు నిర్వహణ లేక అధ్వానంగా ఉన్నాయి. మండలంలోని పలు గ్రామాల్లోని కాలనీలకు మిషన్ భగీరథ నీరు అందడం లేదు. మండల కేంద్రంలో సులభ్‌కాంప్లెక్స్‌లు లేకపోవడంతో మహిళలు, మండల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. కోతులు, కుక్కలు, పందులు, పశువుల బెడదతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కౌటాల వారసంత స్థలం కబ్జాకు గురవడంతో వ్యాపారులు రోడ్డుకు ఇరువైపుల కూరగాయలు విక్రయిస్తున్నారు. దీంతో ప్రతీ సోమవారం కౌటాలలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. సమావేశంలో రానున్న ఖరీఫ్ పంటల సాగుపై చర్చించి ముందస్తుగా రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంది. మండలంలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో, ఎంఈవో, వ్యవసాయ శాఖ, గ్రంథాలయ శాఖ కార్యాలయాలు శిథిలావస్థలో ఉన్నాయి. వీటిపై చర్చించాల్సిన అవసరం ఉంది.

మురికి గుంటతో తంటా



చింతలమానెపల్లి: గ్రామీణ ప్రాంతాలలో రహదారుల పరిస్థితి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిలవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. చింతలమానెపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిపై పెద్ద గుంత ఏర్పడింది. గుంతలతో స్థానికులు తంటాలు పడుతుంటే గుంతలో నిలిచిన మురుగు నీటిలో గేదెలు ఎండనుంచి ఉపశమనానికి సేదదీరుతున్నాయి. అధికారులు చొరవ చూపి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం

బోథ్: కౌఠ(బి) గ్రామంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ రాధిక గంగాధర్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు.